క్లుప్తంగా

ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలి



మందులు పరిశీలిస్తున్న జిల్లా ఉప వైద్యాధికారి

మల్యాల: ప్రతి ఒక్కరూ పరిశుభ్రత పాటించాలని, ఇళ్ల చుట్టూ నీరు నిల్వలేకుండా చూసుకోవాలని జిల్లా ఉప వైద్య, ఆరోగ్యశాఖ అధికారి శ్రీనివాస్ అన్నారు. మండలంలోని ముత్యంపేట ఆరోగ్య ఉప కేంద్రాన్ని ఆయన మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా మందుల నిల్వపై ఆరా తీశారు. రిజిస్టర్లు తనిఖీ చేశారు. అనంతరం గ్రామంలో డెంగ్యూ జ్వరం బాధపడుతున్న వారిని పరామర్శించి, ఇంటింటి సర్వే చేయించారు. పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఇళ్లలో పైరి త్రెం స్ప్రే చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

'హరీశ్‌రావుపై రాళ్లదాడి హేయం'

జగిత్యాలరూరల్: హరీశ్‌రావుపై రాళ్లదాడి హేయమైన చర్య అని మాజీ జెడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత అన్నారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ ఖమ్మం వరద ప్రాంతాల్లో పర్యటించిన బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్‌రావు, ఇతర మాజీ మంత్రులపై రాళ్లదాడికి పాల్పడటం హేయమైన చర్య అన్నారు. కాంగ్రెస్ నాయకులు దాడిచేయడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వ అధినేతగా ఉండి బయటకు రాకుండా, అధికారులతో సమీక్ష చేయకుండా ఉన్న రేవంత్‌రెడ్డిని ప్రజలు ఉపేక్షించరన్నారు.

ప్రభుత్వ విప్, ఎమ్మెల్యేను కలిసిన రెడ్డి నాయకులు

జగిత్యాలరూరల్: జగిత్యాల జిల్లా రెడ్డి సంక్షేమ సంఘం నూతనంగా ఎన్నికైన అధ్యక్షుడు కొప్పెర వెంకట్‌రెడ్డితో పాటు, ఉపాధ్యక్షుడు గడ్డం చంద్రశేఖర్‌రెడ్డితో పాటు, కార్యవర్గ సభ్యులు మంగళవారం ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌లను మర్యాదపూర్వకంగా కలిశారు.

వరద ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



వరద ప్రాంతాలను పరిశీలిస్తున్న డీఎస్పీ

కోరుట్ల: పట్టణంలో వరద ప్రభావిత ప్రాంతాల్లో నివాసముండే ప్రజలు వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని మెట్‌పల్లి డీఎస్పీ ఉమా మహేశ్వర్ రావు అన్నారు. పట్టణంలోని వరద ప్రాంతాలను సీఐ సురేశ్ బాబు, మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతిలతో కలిసి మంగళవారం పరిశీలించారు. పెద్ద వాగు పరివాహక ప్రాంతాల్లో ఉండే ప్రజలు వర్షాల సమయంలో అప్రమత్తంగా ఉండి వాగు ఉధృతి సమయంలో రాత్రి వేళల్లో సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. డీఎస్పీ వెంట ఎస్సైలు శ్రీకాంత్, శ్వేత, శ్యామ్ రాజ్, తదితరులు పాల్గొన్నారు.

గణేశ్ ఉత్సవాలు శాంతియుతంగా జరుపుకోవాలి

కోరుట్ల: ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా శాంతియుత వాతావరణంలో వినాయక నవరాత్రోత్సవాలు జరుపుకోవాలని కోరుట్ల డీఎస్పీ ఉమా మహేశ్వర రావు అన్నారు. పట్టణంలోని వాసవీ కల్యాణ మండపంలో మంగళవారం వినాయక మండపాల నిర్వాహకులతో సమావేశం నిర్వహించారు. గణేశ్ మండపాలను ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐ సురేశ్‌బాబు, ఎస్సై శ్రీకాంత్, వినాయక మండపాల నిర్వాహకులుపాల్గొన్నారు.

వృద్ధురాలు అదృశ్యం

మల్యాల: ఇంటి నుంచి బయటకు వెళ్లిన 82ఏళ్ల వృద్ధురాలు అదృశ్యమైన సంఘటన మల్యాల మండలం రామన్నపేటలో చోటుచేసుకుంది. ఎస్సై నరేశ్‌కుమార్ కథనం ప్రకారం.. రామన్నపేట గ్రామానికి చెందిన పులల్ల వెంకటమ్మ (82) మంగళవారం ఉదయం ఇంటి నుంచి బయటకు వెళ్లి, రాత్రి వరకు కూడా తిరిగి రాలేదు. బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. వృద్ధురాలి కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

వివాహితను వేధించిన వ్యక్తిపై ఫిర్యాదు

మల్యాల: మండలంలోని ఓ గ్రామానికి చెందిన వివాహితను అదే గ్రామానికి చెందిన వ్యక్తి వివాహితను ఫోన్‌లో అసభ్య పదజాలంతో వేధించడంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా, ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసినట్లు తెలిసింది.

విద్యార్థులకు టీ షర్టులు పంపిణీ

మల్లాపూర్: విద్యార్థులు సన్మార్గంలో ముందుకెళ్లాలని ప్రముఖ సామాజికవేత్త పులేరి రాము అన్నారు. మంగళవారం మల్లాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు స్పోర్ట్స్ టీ-షర్టులు(జెర్సీ)లను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎం చంద్రమోహన్‌రెడ్డి, ఉపాధ్యాయులు, పీఈటీ విక్రమ్ పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలి

- మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి

జగిత్యాల:సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు చేపట్టాలని మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం పలువార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, భారీ వర్షాలు పడుతున్న దృష్ట్యాప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని, ఏదైనా అత్యవసర పనులుంటే మున్సిపల్ అధికారులకు సమాచారం అందించాలని చెప్పారు. సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్న దృష్ట్యా నీటి నిలువలు ఉన్న చోట ఆయిల్‌బాల్స్ వేయాలని, దోమల నివారణ కోసం ఫాగింగ్ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో కమిషనర్ సమ్మయ్య పాల్గొన్నారు.



వర్షతాకిడికి గురైన డ్రెయినేజీని పరిశీలిస్తున్న చైర్‌పర్సన్ జ్యోతి

రెయిన్ కోట్లు పంపిణీ

కార్మికులు ఆరోగ్యంగా ఉంటేనే పనులు చేయగలుగుతారని, మున్సిపల్ చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అన్నారు. మంగళవారం కార్మికులకు రెయిన్‌కోట్లు పంపిణీ చేశారు. పట్టణాన్ని నిరంతరం పరిశుభ్రంగా ఉంచడంలో వారిది కీలకపాత్ర అన్నారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

మల్లాపూర్: పౌష్టికాహారంతో గర్భిణులు, బాలింతలు, కిషోర బాలికలు, చిన్నారులు సంపూర్ణ ఆరోగ్యవంతులవుతారని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శంకరమ్మ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేటలో నిర్వహించిన పౌష్టికాహార మాసోత్సవాలలో భాగంగా అంగన్‌వాడీ టీచర్లు గర్భిణులు, బాలింతలకు ఆమె పౌష్టికాహారాన్ని పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, మహిళలు పాల్గొన్నారు.



కోరుట్లరూరల్: బొమ్మలు ప్రదర్శిస్తున్న చిన్నారులు

కోరుట్ల రూరల్: మండలంలోని అన్ని గ్రామాల్లోని అంగన్ వాడీ కేంద్రాల్లో మంగళవారం పోషణ్ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా పిల్లలతో కథలు చెప్పించటం, పిల్లల బరువులు, ఎత్తులు చూడటం, నిర్వహించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, పిల్లల తల్లులు, గ్రామ పంచాయతీ అధికారులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సేవలు సద్వినియోగం చేసుకోవాలి

పెగడపల్లి:మండలంలోని అన్ని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన జాతీయ పౌష్టికాహార మాసోత్సవాలను మంగళవారం అంగన్‌వాడీ టీచర్లు ఘనంగా నిర్వహించారు. చిన్నారులు, తల్లులు, గర్భిణులు, కిషోర బాలికల ఎత్తులు, బరువులు తీశారు. కార్యక్రమంలో వైద్యసిబ్బంది, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



ఆరవెల్లిలో కోడిగుడ్లు, బాలమృతం పంపిణీ

మల్యాల: మండలంలోని తక్కళ్లపల్లిలో పోషణ మాసంలో భాగంగా మంగళవారం తల్లులు, గర్భిణులకు పోషకాహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ మమత, తల్లులు పాల్గొన్నారు.

గురుకుల పూర్వవైభవానికి కృషి

మెట్‌పల్లిరూరల్/కోరుట్ల: : ఎంతో మందిని ఉన్నతులుగా తీర్చిదిద్దిన పెద్దాపూర్ గురుకులానికి పూర్వవైభవం తీసుకువచ్చేలా కృషి చేస్తామని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మండలంలోని పెద్దాపూర్ గురుకుల పాఠశాలను మంగళవారం సందర్శించి, గురుకులంలో జరుగుతున్న పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క ఇచ్చిన హామీ ప్రకారం గురుకులంలో సౌకర్యాలు,వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. అలాగే మృతి చెందిన విద్యార్థి అనిరుధ్ కుటుంబంలో ఒకరికి ఉద్యోగం తప్పకుండా కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అంజిరెడ్డి,నాయకులు లింగారెడ్డి,అనిల్, వేణు,ఆనంద్,మాధవరెడ్డి,సురేశ్ పాల్గొన్నారు.



గురుకుల పరిసరాలు పరిశీలిస్తున్న నర్సింగరావు

సీఎం రిలీఫ్ ఫండ్‌తో పేదలకు మేలు

సీఎంఆర్ఎఫ్‌తో నిరుపేదలకు ఎంతో మేలు జరుగుతుందని కోరుట్ల సెగ్మెంట్ కాంగ్రెస్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని మార్కెట్ కమిటీ కార్యాలయంలో లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా నర్సింగరావు మాట్లాడుతూ నియోజకవర్గంలో ఎంతో మంది నిరుపేదలకు ఎల్‌వోసీలు, సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశామని తెలిపారు.

మహిళల రక్షణ కోసం షీ టీం నిఘా

జగిత్యాలక్రైం: జిల్లాలో మహిళల రక్షణ కోసం షీ టీం నిరంతరం పనిచేస్తుందని షీ టీం ఏఎస్సై అలీబేగ్ అన్నారు. మంగళవారం జగిత్యాల పట్టణ శివారులోని టీఆర్‌నగర్ జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో విద్యార్థినులకు మహిళలపై జరిగే నేరాలపై పోలీసులను సంప్రదించాల్సిన తీరుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో మహిళల రక్షణకై వారి రక్షణకై నేరాలను అరిగట్టడమే లక్ష్యంగా షీ టీం పనిచేస్తుందన్నారు. మహిళలు, యువతులు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా షీ టీం నెంబర్ 87126 70783 సంప్రదించాలన్నారు. సామాజిక మాధ్యమాలతో జాగ్రత్తగా ఉండాలన్నారు. కార్యక్రమంలో మహిళా కానిస్టేబుళ్లు సౌజన్య, పూజిత పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న షీ టీం సభ్యులు

ఘాట్‌రోడ్డు కోసం సర్వే

మల్లాపూర్: మండల కేంద్రం శివారులోని సోమేశ్వర కొండపై ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం మంగళవారం రెవెన్యూ, ఫారెస్టు, ఆర్అండ్‌బీ అధికారుల బృందం పర్యటించారు. ఘాట్‌రోడ్డు నిర్మాణం కోసం ఆర్అండ్‌బీ శాఖ మొదటి విడతగా రూ.10 కోట్లు మంజూరై టెండర్ ప్రక్రియ పూర్తికావడంతో పాటు గతేడాది ఆగస్టు 28న పనులకు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఘాట్‌రోడ్డు నిర్మాణం చేపట్టే గుట్ట(కొండ) భూభాగంపై రెవెన్యూ, ఫారెస్టు శాఖల మధ్య భేదాభిప్రాయాలు ఉన్నాయి. మంగళవారం రెవెన్యూ, ఫారెస్టు శాఖ అధికారులతో కలిసి సర్వే చేపట్టారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈ వెంకటరమణయ్య, తహసీల్దార్ వీర్‌సింగ్, ఆర్ఐలు సురేష్, రాజేష్, ఫారెస్టు డిప్యూటి రేంజ్ అధికారి పద్మ, ఆలయ కమిటీ చైర్మన్ సంగ గంగరాజం, తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

సారంగాపూర్: పర్యావరణ పరిరక్షణలో ప్రతీ ఒక్కరు భాగస్వామ్యం కావాలని జిల్లా సహకార అధికారి మనోజ్‌కుమార్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండల కేంద్రంలోని సింగిల్‌విండో కార్యాలయ ఆవరణలో, నూతనంగా నిర్మాణం చేస్తున్న రైస్‌మిల్లు ఆవరణలో మొక్కలు నాటారు. అనంతరం రుణమాఫీ, ఇతర సింగిల్‌విండో వ్యవసాయ రుణాలపై సమీక్షించారు. కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా కేడీసీసీ డైరెక్టర్ ముప్పాల రాంచందర్ రావు, విండో సీఈవో అయ్యోరి తిరుపతి, గ్రామస్తులు, సిబ్బంది, డైరెక్టర్లు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అందజేత

మల్యాల: సెల్‌ఫోన్ పొగొట్టుకొన్న వ్యక్తికి సీఈఐఆర్ సాంకేతిక విజ్ఞానంతో పోలీసులు సెల్‌ఫోన్‌ను కనుగొని, బాధితుడికి అందజేశారు. మండల కేంద్రానికి అవునూరి లచ్చయ్య ఈ నెల 11న తన సెల్‌ఫోన్ పోగొట్టుకుని పోలీసులకు ఫిర్యాదు చేయగా, సీఈఐఆర్‌తో సెల్‌ఫోన్‌ను కనుగొని, లచ్చయ్యకు అందజేసినట్లు ఎస్సై నరేశ్ తెలిపారు.

యూడైస్ ప్లస్‌లో పాఠశాలల సమాచారం

మల్లాపూర్: యూడైస్ ప్లస్‌లో పాఠశాలల సమాచారాన్ని పకడ్బందీగా నమోదు చేయాలని మండల విద్యాధికారి(ఎంఈవో) భీమయ్య అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని ఎంఆర్సీలో ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల హెచ్ఎంలకు యూడైస్ ప్లస్‌పై అవగాహన కల్పించారు. సమావేశంలో హెచ్ఎంలతో పాటు ఎంఐఎస్‌సీ ప్రతాప్, సీఆర్పీలు సిబ్బంది పాల్గొన్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

కథలాపూర్: మండలంలోని సిరికొండ శివారులో పేకాట ఆడుతున్న 11 మందిని అరెస్టు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ మంగళవారం తెలిపారు. పక్కా సమాచారం మేరకు పేకాట స్థావరంపై పోలీస్ సిబ్బందితో కలిసి దాడి చేసి వారి వద్ద నుంచి రూ. 74,220 స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవీన్‌కుమార్ పేర్కొన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

జగిత్యాలరూరల్: పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపీడీవో రమాదేవి అన్నారు. మంగళవారం జగిత్యాల అర్బన్ మండలం హస్నాబాద్, అంబారిపేట గ్రామాల్లో పారిశుధ్య పనులను పరిశీలించారు.భారీగా వర్షాలు కురిసిన నేపథ్యంలో విష జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని, ప్రజలు ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, శుద్ధిచేసిన నీటిని వాడాలని సూచించారు.

మునీశ్వరుల చెరువుకు గండి

సారంగాపూర్: మండలంలోని అర్పపల్లి గ్రామ శివారుల్లోని మునీశ్వరుల చెరువుకు కొంత మంది రైతులు గండి కొట్టడంతో నీరు దిగువకు వృథాగా పోతుంది. మునీశ్వరుల చెరువుకు గతంలో రెండు మత్తడులు నిర్మించారు. రైతులు తమ పొలాల్లోకి నీరు రాకుండా ఒక మత్తడి వద్ద రైతులు గండి కొట్టారు. దీంతో చెరువు నుంచి చేపలు బయటకు వెళ్లిపోవడంతో మత్స్యకారులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ రమేష్, ఎస్సారెస్పీ డీఈ చక్రునాయక్, ఆర్ఐ కృష్ణ చెరువు గండికొట్టిన ప్రాంతాన్ని పరిశీలించి తక్షణమే మరమ్మతులు చేపట్టాలని, గండి కొట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని తహసీల్దార్, అధికారులు పేర్కొన్నారు.

సమాచారం

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: 2024-25 విద్యా సంవత్సరానికిగాను జగిత్యాల జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ కళాశాలల్లో చదువుతున్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఓసీ, మైనార్టీ విద్యార్థినీ, విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కోసం దరఖాస్తు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్ కులాల సంక్షేమాధికారి రాజ్‌కుమార్ అన్నారు. సెప్టెంబర్ 1 నుంచి డిసెంబర్ 31 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గురుకుల కళాశాలలో సీట్ల భర్తీకి..

ధర్మపురి: మండలంలోని మగ్గిడి సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల/కళాశాలలో 2024-2025 విద్యా సంవత్సరానికి ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం విద్యార్థులు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ గోనె రమేశ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీఈసీలో 24, ఎంఈసీలో 22 మొదటి సంవత్సరంలో ఖాళీగా ఉన్న సీట్లను సెప్టెంబర్ 4న స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బుధవారం ఉదయం 10 గంటలకు మగ్గిడి గురుకుల (బాలుర) కళాశాలలో హాజరు కావాలని, వివరాలకు 7995010582, 8790814467 నంబర్లలో సంప్రదించాలని పేర్కొన్నారు.

డిగ్రీ కళాశాలలో తెలుగు పోస్టుకు..

మెట్‌పల్లి: పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలుగు గెస్ట్ లెక్చరర్ పోస్టుకు ఈ నెల 9తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని ఇంచార్జీ ప్రిన్సిపాల్ వెంకయ్య మంగళవారం తెలిపారు. సంబంధిత సబ్జెక్టులో పీజీ కలిగి ఉండాలని.. నెట్, సెట్, పీహెచ్‌డీ ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యం ఉంటుందని పేర్కొన్నారు.

అతిథి అధ్యాపకులకు..

జగిత్యాల: ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల జగిత్యాలలో ఖాళీగా ఉన్న అతిథి అధ్యాపకుల పోస్టులకు అర్హుల నుంచి దరఖాస్తుల ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ తెలిపారు. పొలిటికల్ సైన్స్1, కామర్స్ 3, మేథమెటిక్స్ 1, కెమిస్ట్రి 1, కంప్యూటర్ సైన్స్ అప్లికేషన్స్ 1, బొటని, 1, జువాలజీ 1 ఖాళీలున్నాయని, పోస్ట్‌గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులుండి ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం మార్కులుండాలన్నారు.నెట్, సెట్, పీహెచ్‌డీ కలిగిన అభ్యర్థులకు వెయిటేజీ ఉంటుందని తెలిపారు. ఆసక్తి గలవారు ఈనెల 4 నుంచి 9 వరకు కళాశాలలో సంప్రదించాలని కోరారు. వివరాలకు 9505305818 నంబరులో సంప్రదించాలని పేర్కొన్నారు.

6న పూజ సామగ్రికి వేలం

మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలం బండలింగాపూర్ గండి హనుమాన్ ఆలయంలో పూజ సామాగ్రి విక్రయాలు చేపట్టేందుకు ఈ నెల 6న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో విక్రమ్ తెలిపారు. ఏడాది పాటు నిర్వహణకు వేలం నిర్వహిస్తున్నామని,ఇందులో పాల్గొనే వారు ముందస్తుగా రూ.20 వేలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొన్నారు.

సామాజిక సేవతో సంతృప్తి



సైకిళ్లు పంపిణీ చేసిన దాతలు

కోరుట్ల: సామాజిక సేవతోనే సంతృప్తి లభిస్తుందని కోరుట్ల మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి అన్నారు. మంగళవారం ఆయన కోరుట్ల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో డా. గుంటుక లహరీశ్ జన్మదినం సందర్భంగా నలుగురు పేద బాలికలకు ఉచిత సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ బట్టు తిరుపతి మాట్లాడుతూ లహరీష్ తల్లిదండ్రులు గుంటుక సురేష్-ప్రసన్నరాణి నిరుపేద విద్యార్థులకు సాయం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఎంఈవో గంగుల నరేశం, హెచ్ఎం కృష్ణ మోహన్, కౌన్సిలర్ ఆడెపు కమల, లయన్స్‌క్లబ్ రీజనల్ ప్రతినిధులు అన్నం అనిల్, పోతని ప్రవీన్,కోటి నవదుర్గ, లయన్స్‌క్లబ్ అధ్యక్షులు పోతని శ్రీలత, తదితరులు పాల్గొన్నారు.



పెగడపల్లి: మండల కేంద్రంలోని యాపల్ చెరువు వాగు వద్ద బ్రిడ్జి నిర్మాణం అర్ధాంతరంగా నిలిచిపోయింది. ఇక్కడ బ్రిడ్జి నిర్మించేందుకు రూ. 1.20 కోట్ల వ్యయంతో పనులు ప్రారంభించారు. నిర్మాణ పనులు నిలిచిపోయి మూడేళ్లు దాటినా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదు. కాంట్రాక్టర్ నిర్లక్ష్యమో, లేక అధికారుల పట్టింపులేని తనమో తెలియదు కానీ పనులు మాత్రం జరగడంలేదని ఈ ప్రాంత రైతులు పేర్కొంటున్నారు. సంబంధిత అధికారులు చొరవ చూపి బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేయించాలని ప్రజలు కోరుతున్నారు.

ఈ సమస్యపై సంప్రదించాల్సిన అధికారి అబ్దుల్ రహమాన్
ఈఈ,పీఆర్ ఫోన్ నంబర్: 9440049017

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9705346639, 94400 61630, 9705346643

ఆలయాలను చుట్టుముట్టిన వరద

ఇబ్రహీంపట్నం: ఎగువ కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నిండిపోవడంతో 41 గేట్ల ద్వారా సోమవారం 3 లక్షల 14వేల క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదిలారు. మంగళవారం గోదావరి వద్ద ఉన్న శంకురిని దేవాలయం, గంగామాత ఆలయం చుట్టూ వరదనీరు ప్రవహిస్తోంది. ఎర్దండి గోదావరి వైపు ఉన్న 60 ఇళ్ల కుటుంబీకులకు ముందస్తుగా అధికారులు అప్రమత్తం చేసి పునరావాస కేంద్రానికి సోమవారం రాత్రి తరలించారు. తహసీల్దార్ ప్రసాద్, ఎంపీవో చంద్రశేఖర్, ఎస్సై అనిల్ రాత్రి అక్కడే బస చేసి, గోదావరి ఉధృతిని ఎప్పటికప్పుడు పరిశీలించారు. గోదావరి ఉధృతిని మెట్‌పల్లి ఆర్‌డీవో శ్రీనివాస్ పరిశీలించి,గోదావరి వైపు ఎవరు వెళ్లకుండా చూడాలని అధికారులను కోరారు. మంగళవారం సాయంత్రం గోదావరి వరద ఉధృతి తగ్గుముఖం పట్టింది.



ఎర్దండి శివాలయం చుట్టూ చేరిన వరద నీరు

సంక్షిప్త వార్తలు

- **సైనికుడికి ఘన స్వాగతం**

ఇబ్రహీంపట్నం: మండలకేంద్రానికి చెందిన ఆర్. శ్రీనివాస్ ఆర్మీలో దేశ రక్షణకు పనిచేసి పదవి విరమణ పొంది మంగళవారం ఇబ్రహీంపట్నంకు వచ్చారు. 2000-2001 పదో తరగతికి చెందిన విద్యార్థులు, అక్షయ స్వచ్ఛందసేవ సంస్థ సభ్యులు ఆయనను గజమాలతో ఘనంగా సన్మానించి, డీజే పాటలతో, బాణసంచా పేలుస్తూ గ్రామంలో ఊరేగించారు. గ్రామస్తులు ఘనంగా సన్మానించి, అభినందిచారు.

- **ఎంపీవోకు పదోన్నతి**

ఇబ్రహీంపట్నం: మండల పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న చంద్రశేఖర్‌కు ఎంపీడీవోగా పదోన్నతి కల్పిస్తూ ఇక్కడే ఎంపీడీవోగా నియమిస్తూ పంచాయతీరాజ్ కమిషనర్ ఉత్తర్వులు జారీ చేశారు. మంగళవారం చంద్రశేఖర్ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టారు. కార్యదర్శులు ఆయనను సన్మానించి, అభినందించారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది, కంప్యూటర్ ఆపరేటర్లు పాల్గొన్నారు.

- **కాలువలకు అడ్డంగా మట్టి పోయడంపై ఫిర్యాదు**

కోరుట్ల రూరల్: మండలంలోని మోహన్‌రావుపేట చిలుక చెరువు రెండు తూముల కాల్వలకు అడ్డంగా పలువురు మట్టి పోసి, బేస్మెంటు నిర్మాణం చేపట్టారని గ్రామ పంచాయతీ కార్యాదర్శి సరిత తహసీల్దార్ కిషన్‌కు ఫిర్యాదు చేశారు. చెరువు కాలువలకు అడ్డంగా మట్టి పోసి, బేస్మెంట్ నిర్మాణం చేపట్టటంతో కాలువల ద్వారా వచ్చే నీళ్లు ఇళ్లల్లోకి వచ్చే ప్రమాదం ఉందని కార్యదర్శి ఫిర్యాదులో పేర్కొన్నారు. కార్యదర్శి ఫిర్యాదు మేరకు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేందర్ రావు చిలుక చెరువు కాలువలను మంగళవారం పరిశీలించారు. మట్టిని, బేస్మెంటును తొలగించాలని ఆదేశించారు. లేకుంటే చర్యలు తప్పవని ఆర్ఐ పేర్కొన్నారు.

- **రోగులకు పండ్లు పంపిణీ**

కోరుట్ల: పట్టణంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో యూనివర్సల్ ఆర్గానిక్ ఆయుర్వేదిక్ ఆధ్వర్యంలో మంగళవారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. డెంగీ, విష జ్వరాలు, బాలింతలకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో యూనివర్సల్ ఆర్గానిక్ చైర్మన్ పడకంటి జగన్, అల్లె ఆనంద్, సత్యనారయణ, రాజేందర్, ప్రదీప్, రజిత, పాల్గొన్నారు.

- **మా ప్లాట్లు మాకు ఇప్పించండి**

ఇబ్రహీంపట్నం: పునరావాసం కింద మాకు కేటాయించిన ప్లాట్లను మాకు ఇప్పించాలని కోరుతూ సోమవారం రాత్రి తహసీల్దార్ ప్రసాద్‌కు ఎర్దండి గ్రామస్తులు విన్నవించారు. గ్రామస్తులు తమకు పునరావసం కింద ఎర్దండి శివారులోని సర్వే నంబర్ 104లో ఒకొక్కరికి 180 చదరపు గజాల చొప్పున 1995లో 200 మందికి పట్టాలు ఇచ్చారని, కాని అక్కడ ఇళ్లు నిర్మించుకుందామని అనుకుంటే బర్తీపూర్‌కు చెందిన వారు ఇది మా భూమి అంటు గొడవలకు దిగుతున్నారని, సమస్యను పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు, అధికారులకు విన్నవించిన పరిష్కరించలేదని తహసీల్దార్ ప్రసాద్‌ను నిలదీశారు. ప్రతీ ఏడాది గోదావరి ఉప్పొంగితే తమకు ఇదే పరిస్థితి అని వాపోయారు. స్పందించిన తహసీల్దార్ మీ ప్లాట్లు మీకు వచ్చేలా పై అధికారులకు విన్నవిస్తానని హామీ ఇవ్వడంతో గ్రామస్తులు సద్దుమణిగారు.

- **పోస్టర్ ఆవిష్కరణ**

జగిత్యాలరూరల్: హైదరాబాద్‌లోని ఓసీ బీసీ జేఏసీ ఆధ్వర్యంలో జరిగే మహా ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని విద్యుత్‌శాఖ ఓసీ, బీసీ జేఏసీ నాయకులు అన్నారు. పట్టణంలోని విద్యుత్ శాఖ కార్యాలయంలో మంగళవారం విద్యుత్ సాధన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పునకు అనుకూలంగా కల్పించాలనికోరారు. కార్యక్రమంలో ఓబీసీ జిల్లా నాయకులు అశోక్‌రెడ్డి, రహీం, శ్రీధర్, ప్రమోద్ పాల్గొన్నారు.

- **నూతన కార్యవర్గం ఎన్నిక**

జగిత్యాల: జగిత్యాల జిల్లా ప్రభుత్వ జూనియర్ కళాశాలల ప్రిన్సిపల్స్ సంఘం నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రమేశ్‌బాబు, కార్యదర్శిగా సంజీవ్, ఉపాధ్యక్షులుగా నారాయణ, జాయింట్‌సెక్రటరీగా నాగభూషణం, కోశాధికారిగా గౌస్ రహమాన్, మహిళ కార్యదర్శి శైలజ, కార్యవర్గ సభ్యులుగా శివరామకృష్ణ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఇంటర్ విద్యాధికారి వెంకటేశ్వర్లు నూతన కార్యవర్గాన్ని సత్కరించారు. ఎన్నికల అధికారులు కొంక వేణు, మహేంద్రకుమార్, శశిధర్ శర్మ వ్యవహరించారు.

- **తహసీల్దార్‌కు వినతి**

రాయికల్: మండలంలోని అల్లీపూర్‌లో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహ ఏర్పాటుకు అనుమతివ్వాని మంగళవారం గౌడ యువజన సంఘం సభ్యులు తహసీల్దార్ ఖయ్యూంను కలిసి వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో అధ్యక్షుడు జనార్దన్, సభ్యులు లవన్‌కుమార్, అంజన్న, గోపాల్, సతీశ్, గణపతి, రాము పాల్గొన్నారు.

- **నేడు విద్యుత్‌కు అంతరాయం**

వెల్గటూర్: మండలం లోని వెల్గటూర్ సబ్ స్టేషన్‌లో పరిధిలోని గ్రామాల్లో బుధవారం ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, ఏఈ శ్రీనివాస్ కోరారు.